# భారత ఆర్థిక వ్యవస్థ

## కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణాభివృద్ధి పథకాలు

### హృదయ్

హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్మెంటేషన్ (Augmentation) యోజనను (హృదయ్) 2015, జూన్ 21న ప్రారంభించారు. దీని కింద ప్రథమంగా ఎంపిక చేసిన 12 నగరాల్లో దాదాపు రూ.500 కోట్లతో మార్చి 2017 నాటికి పట్టణ ప్రణాళిక ఆర్థిక వృద్ధి సాధనతోపాటు ఉత్తమ వారసత్వ నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, తెలంగాణలో వరంగల్ పట్టణాలను ఎంపిక చేశారు.

### అమృత్ (AMRUT)

ఈ పథకాన్ని 2015, జూన్ 24న ప్రారంభించారు. అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే ఈ పథక ప్రధాన ధ్యేయం పట్టణ ప్రాంత కుటుంబాలకు కనీస సదుపాయాలు కల్పించడం. ప్రతి కుటుంబానికి తాగునీరు, మురుగుదొడ్లు, పార్కులు, హరిత ప్రాంతాలను అభివృద్ధి చేయడం. కాలుష్యాన్ని నివారించడానికి సైక్లింగ్‌ను, కాలి నడకను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

### స్మార్ట్ సిటీ మిషన్

ఈ పథకాన్ని 2015, జూన్ 25న ప్రారంభించారు. ఎంపిక చేసిన 100 నగరాల్లో పౌరుల సాధికారత, అనుకూల విధానాలతో తగిన వాతావరణం ఏర్పాటు చేయడం దీని లక్ష్యం. ఆయా నగరాల్లో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో తగిన మౌలిక సదుపాయాలు, జీవన నాణ్యతను పెంపొందించడం దీని ప్రధానోద్దేశం. పబ్లిక్ రంగం, తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, మురుగుదొడ్లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనుసంధానత, ఈ – గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆయా నగరాలను అభివృద్ధి చేయదలిచారు.

### స్మార్ట్ గంగా నగర పథకం

ఈ పథకాన్ని 2016, ఆగస్టు 13న ప్రారంభించారు. నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (NMCG) మొదటి విడతగా గంగానది పరీవాహక ప్రాంతాల ద్వారా కలుషితమవుతున్న గంగా జలాల శుద్ధి కార్యక్రమాన్ని చేపడుతుంది. హరిద్వార్, రిషికేశ్, మధుర – బృందావన్, వారణాసి, కాన్పూర్, అలహాబాద్, లఖ్‌నవూ, పట్నా, బరక్‌పూర్, షాహిబ్‌గంజ్ లాంటి నగర పరిసరాల్లో గంగానది ప్రవాహ జలాల శుద్ధిని చేపడతారు. పబ్లిక్, ప్రైవేట్ ప్రాతినిధ్య పద్ధతిలో దీన్ని చేపడతారు. గతంలో గంగా కార్యాచరణ ప్రణాళిక అమల్లో జరిగిన లోపాలను అధిగమించడానికి తగిన విధానాన్ని ఎంపికచేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన పది నగరాలతోపాటు దీన్ని తర్వాతి కాలంలో మరిన్ని నగరాలకు విస్తరిస్తారు.

## సాంకేతికత, విద్య, నైపుణ్యాభివృద్ధి ఆధారిత పథకాలు

### డిజిటల్ ఇండియా

ఈ పథకాన్ని 2015, జులై 2న ప్రారంభించారు. పౌర సేవలను, ప్రజలను అంతర్జాలంలో అనుసంధానించడంతో పాటు ఆన్‌లైన్ లావాదేవీలను ప్రజలకు అలవాటు చేయడం ప్రధానోద్దేశం. అంతర్జాలం, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ లాంటి గ్యాడ్జెట్లను, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుసంధానించి, వాటి ద్వారా ప్రజల్లో డిజిటల్ సాధికారత, ఎలక్ట్రానిక్ గవర్నెన్స్ సేవలను పెంపొందించి, 'డిజిటల్ ఇండియా' కలను సాకారం చేయడం ప్రధాన లక్ష్యం. అలాగే ఇందులో భాగంగా బ్రాడ్‌బ్యాండ్ హైవేల ఏర్పాటు, అందరికీ అందుబాటులో మొబైల్ అనుసంధానత (3G, 4G లాంటివి), e–క్రాంతి సమాచార సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేస్తారు. డిజిటల్ లాకర్ విధానం, My gov.in లాంటి ప్లాట్‌ఫాం, స్వచ్ఛ భారత్ యాప్, e–సంతకాలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, స్కాలర్‌షిప్‌ల పోర్టళ్లు, డిజిటల్ ఇండియా ప్లాట్‌ఫాం, భారత్ నెట్ లాంటి ప్రాజెక్టులను అమలు చేస్తారు.



R-17-11-17

### స్కిల్ ఇండియా

ఈ పథకాన్ని 2015, జులై 16న ప్రారంభించారు. 2022 నాటికి వివిధ నైపుణ్యాల అభివృద్ధి ద్వారా సుమారు 40 కోట్ల ప్రజలను నిపుణులుగా తీర్చిదిద్దడం ప్రధాన ఉద్దేశం. భారతీయ యువతలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీయడానికి తగిన అవకాశాలను కల్పించడం, వీటి అభివృద్ధికి తగిన రంగాలను ఎంపిక చేసి వాటిలో యువతను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా వివిధ సంప్రదాయ వృత్తులు చేపట్టే నిపుణులకు తగిన శిక్షణ, సహాయం, తోడ్పాటు అందించడం, ఇటీవల అభివృద్ధి చెందుతున్న నిర్మాణ రియల్ ఎస్టేట్ రంగం, రవాణా, జౌళి, నగల తయారీ, బ్యాంకింగ్, టూరిజం లాంటి ఇతర రంగాల్లో నిపుణతను, వాటిలో ఉన్నవారికి నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటారు. అలాగే మన యువత నైపుణ్యాలు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ అవసరాలను తీర్చే విధంగా తీర్చిదిద్దడం, ముఖ్యంగా గ్రామీణ భారత నైపుణ్యం అనే బ్రాండ్ రూపకల్పన, కమ్యూనికేషన్, భాషా నైపుణ్యాలు, పాజిటివ్ థింకింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, యాజమాన్య నైపుణ్యాలు, ప్రవర్తనా, ఉద్యోగ నైపుణ్యాల పెంపుదల ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ నైపుణ్యాల సాధనకు తగిన కేస్‌స్టడీస్, బృందచర్చలు, సృజనాత్మకత గుర్తింపు, బ్రెయిన్ స్టార్మింగ్, లాంటివి ప్రోత్సహిస్తున్నారు.

### దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌసల్య యోజన

దీన్ని 2014, సెప్టెంబరు 25న ప్రారంభించారు. గ్రామీణ పేద యువత నైపుణ్యాభివృద్ధి, ఉత్పాదక సామర్థ్యం, సమ్మిళిత వృద్ధి సాధించేలా చూడటం ప్రధాన ధ్యేయం. గ్రామీణ యువత నెలవారీ వేతనాలు పొందే విధంగా తగిన ఉపాధి కల్పించడం లక్ష్యం. 'అజీవిక' అనే పేదరిక నిర్మూలన మిషన్ అయిన జాతీయ గ్రామీణ లైవ్లీహుడ్ మిషన్‌లో భాగంగా దీన్ని అమలు చేస్తున్నారు.

### ఉడాన్ పథకం

దీన్ని 2014, నవంబరు 14న ప్రారంభించారు. బాలికల ఉన్నత సాంకేతిక విద్యకు తగిన మార్గాన్ని ఏర్పాటు చేసి, వారి సాధికారితను పెంపొందించే అభ్యసనా అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యం. ప్రతిభ కలిగిన బాలికలకు ఉపకార వేతనాలు అందించి, వారిని పాఠశాల విద్య నుంచి ఉన్నత సాంకేతిక విద్య వైపు ప్రోత్సహించడం ప్రధాన ధ్యేయం. పాఠశాల స్థాయిలో సీనియర్ సెకండరీ స్కూళ్లలో బాలికలకు తగిన ఆన్‌లైన్ సదుపాయాలతో గణితం, సైన్స్ సబ్జెక్టుల బోధన ద్వారా తగిన సామర్థ్యాలు కల్పిస్తారు.

### ఉన్నత భారత్ అభియాన్

దీన్ని 2014, అక్టోబరు 31న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. స్థానిక కమ్యూనిటీలకు తగిన అభివృద్ధి సాంకేతికతలను అందించడానికి, వాటిని జాతీయ సాంకేతిక సంస్థలు (NITs), భారత సాంకేతిక సంస్థలు (IITs) , భారతీయ సైన్స్ విద్య, పరిశోధన (IISERs) సంస్థలతో అనుసంధానించాలనేది ప్రధాన ధ్యేయం. గ్రామీణ భారతదేశ అవసరాలను తీర్చే విధంగా పరిశోధన, శిక్షణల ద్వారా ఉన్నత విద్యా సంస్థలను తీర్చిదిద్దడం, గ్రామీణ భారతంలో సైన్స్, ఇంజినీరింగ్, సాంకేతికత, మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యా సంస్థలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం.

### ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన

దీన్ని 2015, జులై 16న ప్రారంభించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (NSDC) ద్వారా అమలయ్యే ఈ పథకాన్ని 14వ ప్రవాసి భారతీయ దివస్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారతీయ యువతకు జీవనోపాధి పెంపుదలకు పారిశ్రామిక ఆధారిత నైపుణ్యాలను పెంపొందించడం, విదేశీ ఉపాధి పొందగోరే యువతకు తగిన నైపుణ్యాలను అందించడం ఈ పథకం ప్రధాన ధ్యేయం.

### జాతీయ అప్రెంటీస్ ప్రమోషన్ పథకం

దీన్ని 2016, ఆగస్టు 19న ప్రారంభించారు. 50 లక్షలకు పైగా యువతకు రూ. 10,000 కోట్లతో 2019 – 20 నాటికి అప్రెంటిస్ శిక్షణ కల్పించడం ప్రధాన ధ్యేయం. నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించే సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఇస్తారు. సంస్థలిచ్చే స్టయిఫండ్‌లో 25% వరకు (గరిష్ఠంగా రూ. 1500 వరకు) నేరుగా కేంద్రమే అందిస్తుంది.

### విద్యాంజలి పథకం

దీన్ని 2016 జూన్‌లో ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాజ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడం ప్రధాన ధ్యేయం. ఒకటో

తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివే పిల్లలకు తగిన సహ పాఠ్యాంశ కార్యకలాపాలను అందించేందుకు రిటైర్డ్ ఉద్యోగులు, టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగ రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, వృత్తి నిపుణులను వాలంటీర్లుగా ఆహ్వానిస్తూ తగిన కార్యకలాపాలను చేపట్టడం ప్రధాన లక్ష్యం. ఈ వాలంటీర్ల ద్వారా పిల్లలకు చదవడం, సృజనాత్మక రాత, పబ్లిక్ ప్రసంగాలు, నటన, కథలు రాయడం లాంటివి నేర్పించడం ప్రధాన ఉద్దేశం. పాఠశాలలను యాప్ ద్వారా వాలంటీర్లు సంప్రదించే విధంగా యాప్ (App) రూపొందించడమే కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద (CSR) కార్పొరేట్ సంస్థలకు తగిన భాగస్వామ్యం కల్పించడం మరోవిశేషం.

## స్వయంప్రభ

దీన్ని 2016, జులై 18న ప్రారంభించారు. ఉచిత ఆన్‌లైన్ విద్యను అందించే ఉద్దేశంతో దేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పౌరులకు 32 డైరెక్ట్ టు హోమ్ (DTH) టెలివిజన్ ఛానల్స్ ద్వారా నాణ్యతతో కూడిన, ఉన్నతస్థాయి విద్యా ప్రమాణాలను అందించడం ప్రధాన ధ్యేయం. విద్యార్థులకు వీలైన సమయంలో నాలుగు గంటల నిడివి ఉన్న బోధనా విషయాలను రోజుకు ఆరుసార్లు ఛానెళ్ల ద్వారా ప్రసారం చేస్తారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్, సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్, ఇంజినీరింగ్, సాంకేతిక విద్య, న్యాయ, వైద్య, వ్యవసాయ రంగం లాంటి బహుళ విభాగాలకు సంబంధించిన కరికులమ్ ఆధారిత విషయాలను ఛానెల్స్ ప్రసారంలో పొందుపరుస్తారు. అలాగే పాఠశాల విద్య, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, బడి బయట పిల్లలు, ఉపాధ్యాయ విద్య, వృత్తి విద్యలను అభ్యసించే వారందరికీ దీని ద్వారా తగిన బోధన విషయాలను ప్రసారం చేస్తారు. ప్రస్తుతం ఆంగ్లంలో అందిస్తున్న ఈ ప్రసారాలను భవిష్యత్తులో ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేసేందుకు కృషి చేస్తున్నారు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY), PMAY గ్రామీణ్ - 2015

ఈ పథకాన్ని 2015, జూన్ 25న ప్రారంభించారు. 2022 నాటికి పట్టణాల్లో 2 కోట్ల గృహాలు, గ్రామీణ ప్రాంతాల్లో 3 కోట్ల గృహాలు నిర్మించాలనేది ప్రధాన ధ్యేయం. ఈ పథకం కింద గృహాలను కొనుగోలు చేసేవారికి గృహ రుణాల్లో వడ్డీ రాయితీ, గృహ విలువలో ప్రత్యక్ష రాయితీ కల్పిస్తున్నారు. అలాగే గ్రామాల్లో అదనంగా రాబోయే మూడు సంవత్సరాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని సంకల్పించారు. 2016 – 17 నుంచి 2018 – 19 వరకు రూ. 81,975 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీనిలో రూ. 60,000 కోట్లు బడ్జెట్ కేటాయింపుల ద్వారా, మిగిలింది నాబార్డ్ ద్వారా సమీకరిస్తారు. దీనిలో కేంద్ర, రాష్ట్రాలు మైదాన ప్రాంతాల్లో 60 : 40 నిష్పత్తిలో, ఈశాన్య రాష్ట్రాల్లో 90 : 10 నిష్పత్తిలో నిధులను కేటాయిస్తాయి. ఇళ్ల నిర్మాణంలో మైదాన ప్రాంతాల వారికి రూ. 1,20,000, కొండ ప్రాంతాల వారికి రూ. 1,30,000 ప్రోత్సాహకంగా అందిస్తారు.

## ఆరోగ్యం, పారిశుద్ధ్య ఆధారిత పథకాలు

### స్వచ్ఛ భారత్ అభియాన్

ఈ పథకాన్ని 2014, అక్టోబరు 2న ప్రారంభించారు. మహాత్మాగాంధీ 'క్లీన్ అండ్ హైజీన్' ఆశయానికి అనుగుణంగా ప్రారంభించారు. 'క్లీన్ ఇండియా మిషన్'గా పేర్కొనే ఈ పథకం భారతీయ నగరాలు, పల్లెల్లో అంతటా ఒక ఉద్యమంలా స్వచ్ఛతను ప్రచారం చేయాలని సంకల్పించారు. ముఖ్యంగా మన దేశంలో ప్రధానంగా ఉన్న బహిర్భూమి (ఓపెన్ డెఫికేషన్) అలవాటును నిర్మూలించి ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేట్లు చేసి 2019, అక్టోబరు 2 నాటికి దేశమంతటా ఆ లక్ష్యాన్ని సాధించాలనేది ప్రధాన ఉద్దేశం. 2019లో గాంధీ 150వ జయంతి నాటికి 12 మిలియన్ల టాయిలెట్లను రూ. 1.96 లక్షల కోట్లతో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఉపాధి, ఉద్యోగ, పేదరిక నిర్మూలన ఆధారిత పథకాలు

### భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా)

ఈ పథకాన్ని 2014, సెప్టెంబరు 25న ప్రారంభించారు. 25 రంగాల్లో వివిధ దేశీయ, బహుళ జాతి సంస్థల ద్వారా దేశంలోనే ఆయా ఉత్పత్తి జరిగేట్లు ప్రోత్సహించడం ప్రధాన ధ్యేయం. వీటి ద్వారా తగిన ఉద్యోగావకాశాల కల్పన మరో ప్రధాన లక్ష్యం. పర్యావరణానికి తక్కువ హాని కలిగించే విధంగా తగిన మూలధన, సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం, నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా రూపొందిన ఉత్పత్తులకు భారతీయ బ్రాండు సృష్టించడం లక్ష్యం.

## స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా

ఈ పథకాన్ని 2016, జనవరి 16న ప్రారంభించారు. సులభతర వ్యాపారానికి తగిన 'అంకుర సంస్థలను' ప్రోత్సహించడం ప్రధాన ధ్యేయం. ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ సాయంతో స్వయం ధ్రువీకరణ ద్వారా అంకుర సంస్థలను నమోదు చేయొచ్చు. వీటి కోసం 19 ప్రణాళికలు (plans) రూపొందించారు. అవి స్వయం ధ్రువీకరణ, స్టార్టప్ హబ్, యాప్ ద్వారా నమోదు, పేటెంట్‌ల రక్షణ రూ. 10,000 కోట్ల నిధి, నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్ట్ కంపెనీ, మూలధన లాభాల పన్ను లేకుండా చేయడం, 3 సంవత్సరాల వరకు ఆదాయపు పన్ను లేకుండా చేయడం, అధిక విలువ పెట్టుబడులకు పన్ను మినహాయింపు, ఇంక్యుబేటర్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడం, అటల్ నవకల్పన మిషన్, 5 లక్షల స్కూళ్లలో తగిన స్టడీ ప్లాన్లు, రిసెర్చ్ పార్క్‌లు, బయోటెక్నాలజీ, స్కూళ్లలో నవకల్పన ఆధారిత పథకాలు, చట్టబద్ధ మద్దతు ప్రధానంగా పేర్కొన్నారు. ఈ ప్రణాళికలను సక్రమంగా అమలు చేయడం ద్వారా అంకుర సంస్థలను మరింత ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన

ఈ పథకాన్ని 2016, డిసెంబరు 16న ప్రారంభించారు. పేదరిక సంక్షేమ పథకాలు మరింత సమర్థంగా అమలు చేయడానికి తగిన నిధులను సమకూర్చుకోవడానికి దీన్ని ప్రారంభించారు. ఆదాయపు పన్ను ఎగవేతదారులు మరోసారి తమ ఆదాయాన్ని చట్టబద్ధంగా ప్రకటించినప్పుడు 30% పన్ను, 10% పెనాల్టీ, పన్నుపై 33% సర్‌ఛార్జ్, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ సెస్సు కలిపి విధిస్తారు. ఈ ఆదాయాన్ని నగదు లేదా డిపాజిట్ ద్వారా బ్యాంకు లేదా పోస్టాఫీసుల ద్వారా వెల్లడించవచ్చు. వెల్లడించిన ఆదాయంలో 25% శూన్య వడ్డీతో నాలుగు సంవత్సరాల వరకు కచ్చితంగా డిపాజిట్ చేయాలి. దీని ద్వారా ప్రకటించిన ఆదాయాన్ని ఆ ఎసెస్‌మెంట్ ఇయర్‌లో ఆదాయపు పన్ను చట్టం ద్వారా ప్రకటించిన మొత్తం ఆదాయంలో కలపకూడదు. ఈ పథకం కింద ఆదాయం వెల్లడించనప్పుడు తదుపరి ఆదాయం రిటర్నులో 77.25% పన్ను విధిస్తారు.

**రచయిత: దాడి నారాయణరావు**

www.eenadupratibha.net